# మధుర భావన-18

వంశీ ని కోపంగా చూస్తూ శ్యామసుందరి... ''అంటే...నా ఈ ప్రయత్నం అంతా వృధా చేస్తావా...? సుమజకు మాట ఇచ్చి... ఇపుడు తిలోత్తమని చేసుకుంటానని ఎలా చెబుతున్నావ్...? పైగా అనూషకి .... మీనాన్న కోరిక కాదని స్థలం ఇస్తావా... నాతో రాయిస్తావా...? అది జరిగే పనేనా...?'' గొంతు పెంచి దూకుడుగా అంది.

తిలోత్తమ బిత్తరపోయింది.

వంశీ విభ్రాంతిగా చూసాడు తల్లివైపు.

''అయితే అమ్మా... నన్ను నువ్వు... గుర్తుపట్టినట్లే కదూ...? నీ ప్రయత్నం అంతా వృథాయేనా అనడుగుతున్నావంటే...'' అంటూ తల్లిని సందేహంగా అడిగాడు.

శ్యామసుందరికి చటుక్కున ఏదో గుర్తువచ్చినట్లు తలదించుకుంది.

వంశీ ఆనందంగా చిరునవ్వు చిందించాడు.

''అమ్మా... నా ఆలోచన ఫలించింది! నా ఊహ నిజమేనని నిరూపించావు!'' అన్నాడు వంశీ ఉత్సాహంగా.

శ్యామసుందరి ఏమిటన్నట్లు అయోమయంగా చూసింది.

వంశీ చెప్పుకుపోయాడు ''ఒక రోజు సుమ నాతో అంది 'అత్తయ్య మనసుకు ఏదో గాయం తగిలినందువల్లే ఇలా అయివుంటుందని' డాక్టరు అన్నారని. ఏమై వుంటుందా అని ఆలోచించాను. కానీ నా ఆలోచనకు ఏమీ కారణం కనుపించలేదు. ఏమైనా తెలుస్తుందేమోనని నీ గదిలోని వస్తువులన్నీ పరిశీలనగా చూడాలనుకున్నాను.

ఒకసారి... నువ్వు ఏదో చదువుతూ నేను నీ రూం లోకి రాగానే అది దాచేస్తూ ....ఏమిటని అడిగితే , కథల పుస్తకం ఎవరో ఇచ్చారని చెప్పి చదువుతున్నానని అన్నావు. అప్పుడు నేను పట్టించుకోలేదు గానీ తర్వాత వెతుకుతున్నప్పుడు, ఆ పుస్తకంలో నువ్వేం కథ చదివావో నాకు తెలిసింది.. ఆ పేజీ దగ్గరే ఒక చివర కొంచెంగా మడచి పెట్టటం వలన... నేనూ ఆ కథని చదివాను.

ఆ కథలో... ఒక ఆవిడ తన భర్తకి వచ్చిన మానసికరోగాన్ని గుర్తిస్తుంది. దానికి వైద్యం చేయిస్తే... ఇంట్లోవాళ్ళతోపాటూ అందరూ అతన్ని చులకనగా భావించి ఆ కారణంతో వ్యాపార విషయాలన్నిటిలోనూ దూరం పెట్టే అవకాశం ఉందని ఆమెకు అనిపించటలో ఒక నిర్ణయానికి వస్తుంది.

తనకు తెలిసిన డాక్టరు దగ్గర ట్రీట్ మెంట్ కోసం చేరి, తనకు సాయంగా భర్తనీ అక్కడే ఉంచుతున్నట్లుగా చెప్పి... అతనికి వైద్యం చేయిస్తుందావిడ!

అనూష కూడా ఒక సంగతి చెప్పింది... మానసిక స్థితి సరిగా లేనపుడు ఎటువంటి ఆస్తులు బదలాయింపు జరిగినా చెల్లుబాటు కావని, అందువలన అమ్మకి బాగానే ఉందని డాక్టరుగారు తెలియజేసి డిస్చార్జి చేస్తే, తనకు తను కోరిన స్థలం రాసివ్వటానికి ఎటువంటి అభ్యంతరం ఉండకపోవచ్చని! ఆ పైన నీ గదిలో నేను రెండు మూడు పేపర్ కటింగ్ లూ చూసాను...అవి మానసిక జబ్బుగురించి తెలియజేసే వార్తలూ, ఆ జబ్బు లక్షణాలు ఎలా ఉంటాయో తెలియజేసేవీను.

వీటన్నిటినీ కలిపి ఆలోచిస్తే... అపుడు నాకో అనుమానం వచ్చింది. నాన్న మాట ప్రకారం ఆ స్థలం అనూషకి రాసి ఇవ్వటానికి ఇష్టంలేకనే, ఆ మాట ఖచ్చితంగానూ చెప్పలేక, ఇలా మానసిక జబ్బేదో వచ్చి కొందరిని, కొన్ని సంఘటనలను మర్చిపోయినట్లుగా నటిస్తున్నావేమోనని!

ముందు నేను చిన్నప్పటి సంఘటనలను గుర్తు చేస్తూ నన్ను గుర్తుకు వచ్చేట్లుగా చేద్దామని ప్రయత్నించి విఫలమయ్యాను.

ఇక ఇపుడు రెండో ప్రయత్నంగా ముందు అనుకున్నట్లుగా నేనే సుమజను కాకుండా తిలోత్తమను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్లూ తెలిసేటట్లు చేయాలని అనుకున్నా.

సరిగ్గా నేను అనుకున్నట్లే జరిగింది!

ఇదంతా చెప్పిన వంశీ తల్లివైపు చూస్తూ ‘‘నేను సరిగానే ఊహించాను కదమ్మా...?’’ అనడిగాడు.

ఆవిడ నిట్టూర్చింది.

‘‘అవును... బాగానే ఊహించావు...’’ అంది. ఒక క్షణం తర్వాత ‘‘అయితే....’’ అంటూ తిలోత్తమ వైపు, వంశీ వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

వంశీ అపరాధిలా తలవంచుకున్నాడు.

“ తిలోత్తమ విషయంలో నేను తప్పు చేసాను. తనకీ విషయం ముందుగా చెబితే అంగీకరించదేమో అన్న ఆలోచనతో చెప్పలేదు! చెబితే ఒప్పుకునేదేమోనని ఇపుడనిపిస్తోంది!’’

తిలోత్తమ నిట్టూర్చింది.

‘‘నువ్వన్నది నిజమే బావా... ముందుగా నాకీ విషయం చెబితే, ఒప్పుకునేదానినా కాదా అన్నది నాకే ఇపుడు సరిగా తెలియటం లేదు! సరే, ఏదో అయిందేదో అయిపోయిందిగా!

ఒక క్షణం మౌనం తర్వాత మళ్ళీ అంది ‘‘నాకూ నీ ప్రవర్తన కొంత అనూమానస్పదంగానే అనిపించినా, నా అందం మీద నాకున్న నమ్మకంతో, నా వైపు మొగ్గు చూపించివుంటావని అనుకున్నా! పోనీలే... నువ్వనుకున్నట్లే జరిగిందిగా! మంచిదే!’’ అంది తిలోత్తమ.

ఆమెలో కొంత అసంతృప్తి కనుపించినట్లుగా వంశీకి అనిపించింది.

‘‘ఈ విషయంలో... నేను రుణపడింది, క్షమాపణ కోరాల్సింది నిన్నే తిలోత్తమా...!’’ అన్నాడు వంశీ ఆమె చేతుల్ని పట్టుకొని

తిలోత్తమ చిన్నగా నవ్వేసింది.

‘‘క్షమాపణ కోరాల్సినంత పెద్ద తప్పేం చేయలేదులే...! కొంత భ్రపడ్డాను... అది నిజం కాదని తెలుసుకున్నాను! అంతేగా!’’ అంది.

“ఒక మాట తిలోత్తమా...” అంటూ వంశీ చెప్పటం మొదలుపెట్టాడు.

“ ఇక్కడికి రాకముందే నీకీ విషయం చెప్పాలనుకుని కథ అంటూ మొదలుపెట్టాను. అయితే మా గురించి ఎలా చెప్పాలో తెలియక, పక్షులంటూ మొదలు పెట్టేసరికి నువ్వు చిరాకు పడటంతో ఆపేసాను.

సరే, ఇపుడు చెబుతాను. ఆ చిలుకలు మేమే... నేనూ, సుమజా అన్నమాట! ముందుగా తన అక్షరాల్లోని భావానికీ, సొగసుకీ ఆకర్షితుడినయ్యాను ఆ తర్వాత అనుకోకుండా ఒక శుభకార్యంలో తనతో పరిచయం ఏర్పడింది.

అపుడే, ఒకరోజు ఉదయం క్రొత్త దంపతులతో సత్యన్నారాయణ వ్రతం కాబోలు జరుగుతోంది. ఆ తోటలో కట్టిన గెస్ట్ హౌస్ లోని పెద్ద హాలులో జరుగుతూంటే, అందరూ అక్కడే ఉన్నారు. నేను సుమజ కోసం చూస్తే కనుపించకపోయేసరికి తన ఫ్రెండ్స్ ని అడిగాను. ఆ గెస్ట్ హౌస్ లోని కొన్ని గదులను కొందరికి కేటాయించార్లే.

వాళ్ళు సుమజ ఉంటున్న గదివైపు చేయి చూపించేసరికి అప్రయత్నంగానే నేనటు అడుగులు వేసా. ఎవరివో మాటలు వినిపించేసరికి గుమ్మంవైపు వెళ్తూ ముందుగా తెరిచిఉన్న కిటికీ దగ్గర ఆగి లోపలివైపుకు చూసా.

అక్కడి ఆవరణమంతా శుభ్రం చేసే ఆవిడ సుమజ చేతులు పట్టుకుని చెబుతోంది.

''నాను నా పని సేసుకుంటూ పోతున్నానేగానీ, నావెనకనే తిరుగుతున్న పిల్లని చూసుకోలేదమ్మా... గాజుగ్లాసు పెంకు పాదం లోపలికి అంతలా గుచ్చుకుపోయి రక్తం కారుతూంటే, అది కూలబడి ఏడవటం తో నాకు బుర్ర పని సెయ్యనేదమ్మా...దేవతలా మీరు చూసి ఈ డాటరు బాబుని పిలిపించి కట్టుగట్టిం చి సానా మేలు చేసారు తల్లీ...!''

ఆ మాటలకు సుమజ చిరునవ్వుతో ''నువ్వు నీ పనిలో మునిగి ఉన్నావు. నేను ఖాళీగానే వున్నాను కనుక చూసాను. నాన్నగారు ఏదైనా అవసరం పడితే చేయమని తన డాక్టరు స్నేహితుడి ఫోను నెంబరు ఇవ్వటం వలన ఇలా వీలయింది! ఆయన నా ఫోను అందుకొని వచ్చి వెంటనే వైద్యం చేసారు. ఇదంతా ఆయన వలనే జరిగింది!'' ఆమెతో చెప్పి డాక్టరుగారికి ''థేంక్సండీ'' అంటూ చేతులు జోడించింది. ఆయన చిరునవ్వుతో వెళ్ళొస్తానని చెప్పగానే సుమజ తలవూపి ఆవిడతో 'నేనూ వెళ్ళి అక్కడ అందరితో కూర్చుంటాను. నువ్వు మీ అమ్మాయిని దగ్గరుండి చూసుకుని డాక్టరు చెప్పినట్లుగా చేయి... ఆ టాబ్లెట్సు వేయి..' అని ఆదరంగా చెప్పింది.

నేనూ నిశ్శబ్దంగా అక్కడనుండి వెనుదిరిగాను.

అపుడే నాకు సుమజ ప్రవృత్తి ఎటువంటిదో అర్ధమైంది!

అందమైన రూపురేఖలే కాదు, అంతముమించిన అందమైన అంతరంగమూ తనకు ఉందని అనుకున్నాను!

ప్రేమ, సేవ... అనే దివ్యమైన పదాలే ఆమె అంతరంగ అందాలని తెలుసుకున్న నేను తన పట్ల ప్రేమని పెంచుకున్నాను. తరువాత తన చిరునామా తెలుసుకుని వెళ్ళి నా ప్రేమని తెలియజేశాను. తనకూ నా పట్ల ఇష్టం ఏర్పడిందన్న విషయం గ్రహించాక నేనెంతో అదృష్టవంతుడినని ఆనందించాను.

అమ్మకూడా తన అనుమతి తెలియజేశాక, ఇక మా వైవాహిక జీవితానికి ఎటువంటి అభ్యంతరం లేదనుకున్న నాకు అమ్మ అనారోగ్యం కారణంగా మనసుకు తేరుకోలేని గాయం ఏర్పడింది. అమ్మకి ఈ మతిమరపు అనే అనారోగ్యంతో ఏర్పడిన మానసిక వ్యాధి నిజం కాదేమోననే ఆలోచన వచ్చింది. అది నా

అనుమానమా, నిజమా అన్నది తేల్చుకోవటానికీ నేనిలా ప్రవర్తించాల్సి వచ్చింది! అమ్మ అనారోగ్యం నిజమా, కాదా అని తేల్చుకునే ప్రయత్నంలో భాగంగా నీతో ప్రేమని ఓ సాకుగా ఎంచుకున్నాను. అందుకు క్షమాపణ కోరుతున్నాను.

సుమజపట్ల నా కేర్పడిన ప్రేమ బంధం ఎంత బలమైనదంటే... అది జీవితాంతం పెరుగుతూనే ఉండేదేగానీ...తరిగేది కాదు. ఇంక ఏ ఇతర కారణాలూ, వ్యామోహాలూ నన్ను తన నుంచి మరల్చలేవు. నేను కేవలం తన బాహ్య సౌందర్యానికే ముచ్చటపడలేదు...అంతకు మించిన తన మానసిక సౌందర్యానికి దాసోహమయ్యాను...! ఈ నా అంతరంగాన్ని కథ ద్వారా తెలియజెప్పాలని ఉదయం కథ అని మొదలుపెట్టాను, కానీ చెప్పలేకపోయాను. నిజానికి ఆ కథ ద్వారా నే చెప్పాలనుకున్న మాటలివే తిలోత్తమా...!''

* * *

ఆ తర్వాత కార్యక్రమాలన్నీ చకాచకా జరిగిపోయాయి.

డాక్టరుకి చెప్పటం, గది ఖాళీ చేయటం లాంటివన్నీ ముగించి ఇంటికి చేరారు.

ముందు వంశీ ఈ విషయం చెప్పి ఆయన అనుమతి తీసుకోవటం జరిగింది కాబట్టి... ఆయనా అన్నీ అర్థం చేసుకుని వాళ్ళని సాధరంగా సాగనంపటం జరిగింది.

ఇంటికి వచ్చాక...

స్థిమితంగా కూర్చున్న తల్లితో ''ఏమిటమ్మా... ఇంత చిన్న విషయానికి.... మమ్మల్ని అంత కంగారు పెట్టేసావ్...?'' నిష్ఠూరంగా అడిగాడు వంశీ.

''మరేం చేయమంటావు? నువ్వేమో చాలా తేలిగ్గా... చెల్లెలుకే కదా ఇచ్చేద్దామని అంటావు... అనూషేమో... వాళ్ళ నాన్న కోరిక గురించి స్పష్టంగా చెప్పినా వినకుండా, తనకే కావాలని పట్టు బట్టింది! నాకేమో...'' అంటూ ఒక క్షణం ఆగిన శ్యామసుందరి మళ్ళీ చెప్పింది ''మీ అమ్మకు చెందిన ఆస్తి మీ నాన్న కోరికగా నీకే చెందాలని గట్టిగా అనిపించింది మరి! చిన్నతనంలో... నేనీ మాట విన్నాను... మా బంధువుల్లో ఎవరికో ఇటువంటి జబ్బు రావటం వలన.. అపుడు అతను అమ్మిన ఆస్తికి విలువలేదంటూ అతని వారసులు గొడవ చేశారని! అందుకని నేనూ అదే పద్ధతిని పాటిద్దామని... అలా చేసానంతే....!''

శ్యామసుందరి మాటలకు వంశీ అలిగినట్లుగా మొహం పెట్టాడు.

‘‘అయితే... ఆవిడెవరోకి చెందిన ఆస్తిని నాకు ఇవ్వాలనే ఆరాటంతోనే ఇలాంటి పని చేసావంటావ్...? నువ్వు... అనూషకే తల్లివి కానీ... నాకు కాదని చెబుతున్నావ్... అంతేగా...?’’

ఆవిడ చటుక్కున తల అడ్డంగా వూపింది. వంశీ తలపై చేయివేసి ‘‘ఏం మాట్లాడుతున్నావ్ రా...? నా ఉద్దేశ్యం అది కానేకాదు! మీ నాన్న కోరిక నెరవేర్చాలన్నదే నా కిష్టమైన ఆశ! అంతే! అనూష స్వభావం చిన్నప్పటినుండీ నేను గమనిస్తూనే ఉన్నాగా... తనకి ఎంత ఇచ్చినా ఇంకా ఇంకా కొసరుతూనే వుండే స్వభావం! నేను... ఇద్దరికీ తల్లిని కాబట్టే... ఆస్తి అంతా అనూషకే కాదు, నీకూ వాటా ఇవ్వాలని తాపత్రయ పడ్డాను! అర్థమైందా...?’’ అంది.

వంశీ చిరునవ్వుతో చూసాడు. ‘‘నాకు తెలుసమ్మా..! అయినా సరే, నీ నోటివెంట నువ్వు నన్ను కొడుకుగా లాలించే మాటలు పదేపదే వినాలి ఉంటుంది మరి!

* * *

ఆ మరునాడు...

వంశీ, శ్యామసుందరి ఇద్దరూ ఉన్నపుడు తిలోత్తమ వచ్చి ‘‘నేను మా ఊరుకు వెళ్దామని అనుకుంటున్నాను...!’’ అని మెల్లగా చెప్పింది.

వంశీ నిలబడి వున్న తిలోత్తమ దగ్గరకు వచ్చి ‘‘నాపై కోపం లేదుగా...?’’ అనడిగాడు.

తిలోత్తమ చిరునవ్వుతో చూస్తూ చెప్పింది ‘‘ఆ రోజు సుమతో మనిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నామని చెప్పినపుడు... తను ఏమైనా వాదన పెట్టకుంటుందేమోనని నేను అనుకున్నాను అన్నా కదా అపుడు నువ్వేమన్నావో గుర్తుందా...? ‘తను అలాంటి గొడవేమీ చేయదని, చాలా హుందాగా తప్పుకుంటుందనీ’ అన్నావ్...! ఇపుడు నేనూ సుమజని చూసి నేర్చుకున్నానని అనుకో... ఇలాచేయటం తప్పు కదా అని గొడవేం పెట్టుకోకుండా హుందాగా తప్పుకుంటా! ఆపైన ఇంకోమాట... తనను కాదనుకున్న వాళ్ళది దురదృష్టంగానీ, సుమజది కాదని నువ్వు అన్నట్లే... ఇపుడు నేనూ అదే అనుకుంటున్నాను! కొన్నాళ్ళు సరదాగా గడపటానికి వచ్చాననీ, అలాగే వెళ్ళిపోతున్నాననీ అనుకుంటా... అంతే...! ఈ తతంగంలో నేను పొందిందేమీ లేకపోయినా పోగొట్టుకున్నదీ ఏం లేదు...!’’ అంటూ తిలోత్తమ మళ్ళీ నవ్వేసింది.

‘‘నేనూ తోడుగా నీతో మీ ఊరుకు రానా...?’’ అని వంశీ అడిగిన ప్రశ్నకి తిలోత్తమ ‘‘ఎందుకూ... ఒక్కదాన్నీ వచ్చినదాన్ని... అలాగే వెళ్ళలేనా..?’’ అని ఎదురు ప్రశ్నవేసింది.

శ్యామ సుందరి దగ్గరికి వెళ్ళి ''అత్తయ్యా... వంశీ, సుమజల పెళ్ళికి నేనూ వస్తా... సందడంతా నాదే! ఇక... అనూష వదిన 'నువ్వు... కేవలం ఆ స్థలం కోసమే ఇంత చేసావని తెలిసాక, తప్పకుండా తన కోరికను వెనక్కి తీసుకుంటుందిలే! అదేం సమస్యగా ఉండదు!'' అంది ఆవిడ చేతులు ఆప్యాయంగా పట్టుకుని.

శ్యామసుందరి చిరునవ్వుతో ''తప్పకుండా నువ్వు రావాలి'' అంటూ ఆశీర్వదిస్తున్నట్లుగా తిలోత్తమ తలపై చేయి వేసింది.

వంశీ తిలోత్తమ వైపు చూస్తూ ''ఇంత అతి చక్కని అమ్మాయిని తిక్క తిలోత్తమని అన్న వాళ్ళెవరు ?.. ఏం బాగుండలేదూ'' అంటూ సరదాగా నవ్వాడు.

* * *